


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -139-

(19 మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**తెల్లవారు ఝామునే** నిద్ర మేల్కొని గందరగోళం చేస్తున్న భర్తతో విసిగిపోయిన భార్య "ఎందుకండీ ఇంత పెదరాడే లేచి కూర్చోవడం. ఇంకో గంటకుగానీ పాలు రావు. పత్రిక రాదు. మెలుకువ వస్తే పోనీ అలా కళ్ళుమూసుకుని పడుకుని ధ్యానం చేసుకోరాదుటండీ. కొంచెం మనశ్శాంతిగా వుంటుంది" అనడం మామూలు.

కానీ కొన్ని ఘటాలకు ఒకసారి నిద్ర మెలుకువ అంటూ వస్తే మళ్ళీ కునుకు రావడమంటూ వుండదు. పది కప్పుల టీ త్రాగినవాడికి మల్లే నిద్రపట్టదు. కళ్ళు ఎర్రబడతాయి. ముఖం నల్లబడుతుంది. రూపం మారుతుంది కానీ నిద్ర పట్టదు.

"ఇంకా తెల్లవారలేదండి. కొంచెం కునుకు పట్టించుకోండి" అంటే

"నిద్రా! నువ్వు కాదుగదా ఇంకా పదిమంది వచ్చి అదిమి పట్టినా రాదు. నన్నేం చెయ్యమంటావు పొమ్మంటే తలుపు తీసుకుని బైటికి పోతాను" అంటాడు పాపం.

"అంత మాట అంటారేమిటండీ. ఇల్లు మీది, సంసారం మీది తలుపు తీసుకుని బైటికి పొమ్మని ఎవరనగలరండీ" అని భార్యామణి "అయితే మీకు పున్నెం వుంటుంది. అంతగా వెడితే కొంచెం చెప్పి వెళ్ళండి. తలుపు ఘడియ వేసుకుంటాం" అనడం సంభవిస్తుంది.

ఒకసారి పశ్చిమ గోదావరి జిల్లాలో వున్న ఒక బంధువుల ఇంటికి వెళ్ళాను. నేనూ ఆ పుస్తకం ఈ పుస్తకం చదివి వంటి గంటకు నిద్రపోయాను. ఒక్క కునుకు తీసి లేచి చూద్దును కదా ఇంటిల్లపాది లేచి పనులు చేస్తున్నారు. "టైం ఎంత అయిందండీ?" అన్నాను.

ఒకామె "మూడున్నర దాటింది. నాలుగు అవబోతుంది" అంది వాకిలి మెట్లు కడుగుతూ "అప్పుడే లేచారేం ఇవ్వాళేమన్నా ప్రత్యేక కార్యక్రమమా?" అన్నాను.

"నిత్యం ఇంతే నాయనా మూడున్నరకే లేస్తాం. ఏడున్నరకు వంటలయిపోతాయి. తొమ్మిదిన్నరకు భోజనాలైపోతాయి" అంది. లోపలికి తొంగిచూద్దునుకదా - ఒకావిడ కూరలు తరుగుతుంది.

ఇంతలో ఒక కోడలు బయటికి వచ్చి "ఎన్ని పొయ్యమన్నారు బియ్యం, అత్తయ్యగారూ?" అని దీర్ఘం తీసింది.

నాకెంతో ఆశ్చర్యం వేసింది ఇంకా వేగుచుక్కన్నా పొడవలేదు అప్పుడే దీర్ఘాలు సాగిస్తూ బియ్యం కడగడానికి బయలుదేరిందేమిటీ ఇల్లాలు అనిపించింది. ఇంకా నిద్ర ఎక్కడ పోయేది?

మంచం మధ్యగా కూర్చుని "మహానుభావా ఏమిటి నీ సృష్టి ఎన్ని రకాల జీవుల్ని తయారు చేశావు? ఎలాటి విచిత్ర రంగాలు సృష్టించావు? ఎన్నెన్ని తాపత్రయాలు కల్పించావు? తెల్లవారు జామున లేచి నీ భజన చేసుకున్నా కొంత బాగుండను. ఇప్పటినుంచే భోజనం గొడవా సావీ" అనుకుంటూ కాలం గడిపాను.

"లోపల కూరలు తరుగుతున్నావిడ నీళ్ళు కాగినాయి. ఎవరైనా ఒకరు స్నానాలు మొదలు పెట్టండి" అని అరిచింది బిగ్గరగా. 'మీ స్నానాలు చల్లగుండ! నాలుగింటికే స్నానాలా? తెల్లారేటప్పటికే అవి జిడ్డుకారతాయి" అనుకున్నాను.

ఆ గృహస్తు వచ్చి "ఏమండీ నిద్ర బాగా పట్టిందా?" అన్నాడు.

"ఆ ఆ బాగానే పట్టింది" అన్నాను.

"మీరు తెల్లవారు ఝామున లేస్తారా?" అన్నారు.

"ఆ!ఆ! లేస్తాను. అలవాటుంది" అన్నాను.

"అలాగా, ముఖం కడుక్కుని స్నానం చెయ్యండి" అన్నాడు.

"అలాగే అలాగే" అన్నాను ఏమి చెప్పాలో తోచక.

మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళలేదు. వెళ్ళడం తటస్థించినా పగలు వెళ్ళి చక్కా రావలసిందేగాని రాత్రిపూట వుండకూడదని నిర్ణయించుకున్నారు. వారంతా నిద్రపోతూనే వుంటారు. ఆ ఇంట్లో మాత్రం అంతా కొరివిదయ్యాల తంతుగావుంటుంది.

కొందరి ఇళ్ళకు వెడితే కథ దీనికి వ్యతిరేకంగా వుంటుంది. మనం ఆరింటికి లేచి కూర్చున్నా వారు ఎంత సేపటికీ లేవరు. గృహస్థు లేచి పచార్లు చేస్తున్న గృహిణి మాత్రం లేవదు. ఆయనగారు కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతూ వుంటాడు. కొంతసేపటికి మన దగ్గరికి వచ్చి "లేచారా? ఎంతసేపైంది?" అని పలకరించి మళ్ళీ అదృశ్యమవుతారు.

వెళ్ళి ఆవిణ్ణి లేపుతాడు కాబోలు. కొంచెం కాఫీ ప్రయత్నమన్న సాగుతుందనిపిస్తుంది. కాని అంతపని చెయ్యడాయన. వెనుకటికి కృష్ణమాయ చిత్రంలో ఒక హాస్య పాత్రధారి, ప్రొద్దెక్కిన దాకా నిద్రలేవని భార్యను చూచి "బారెడు ప్రొద్దెక్కిందినీ చారెడు కళ్ళు తెరవ్వే నా నవ్వుల బండీ" అంటాడు. సినిమాల్లో కాబట్టి ఆ మాత్రం హాస్యం, చనువూ వుంటాయి సంసారాల్లో ఎక్కడి నుంచి వస్తాయి.

జాక్స్మిత్ అనే అయిన ఉదయం పూట నిద్రలేవడం అనేదాన్ని గురించి ఇలా వ్రాశాడు -"ఆరోగ్యంగా వున్న సమయాలలో కూడా ఉదయం పూట గాఢ నిద్రలేవడానికి ఎంతో బాధపడతాం. ఈ మాట చెప్పడానికిక్కూడా ఎంతో సిగ్గు వేస్తుంది. నా మటుకు నేను ఎంతో అవస్థ పడతారు. నవ్వుతూ నిద్రలేవడానికి ముఖం డెబ్బయి ముడతలు పడుతుంది. చూచేవాళ్ళకు వికారం కూడా."

డాక్టర్, హెచ్ అనే ఆయన అన్నాడు "ఉదయం నిద్రలేచేటప్పటికే బుర్ర చితికి పోయినంత పని అవుతుంది తర్వాత పడే శ్రమ ఆ దైవానికే ఎలుక" అని.

ఆయన నిద్ర లేవడానికి బాధపడే వాళ్ళను గురించి జాలి పడుతూ ఇంకో చోట ఇలా చెప్పాడు "నిద్ర లేచిన తర్వాత ఎంతో భారవహమైన జీవనం గడపవలసి వస్తూంది. కొందరు వారు దాన్ని తలుచుకునే కుప్పకూలి పోతారు. నిద్రవారికి గొప్ప విశ్రాంతి సీమ."

ఈ విషయంలో మరి కొందరు ప్రముఖులు చేసిన పరిశోధనలను గురించి మరోసారి వివరిస్తారు.

Post your comments